# పెన్నిధి

పొద్దున ఏడుగంటలయింది. రంగన్న అప్పటికే చాయ్ తాగి చద్దన్నం తినేశాడు. ఇంటి ముందు చెట్టుకింద నిలిపిన రిక్షాబండిని తుడవటం మొదలుబెట్టాడు. ఇప్పుడనగా వెళ్తే ఏ రాత్రికో ఇల్లు చేరుకోడం. మధ్యాహ్నం ఎక్కడో డబుల్ రొట్టి తిని చాయ్ తాగేస్తాడు. కొంచెం జేబు గలగలా అని ఉంటే బ్రెడ్డు పకోడా, మిరపకాయ బజ్జీలు కూడా పట్టిస్తాడు. బీడీ, సిగరెట్టు, పాన్ ఈ వ్యసనాలేమీ లేవు. కాని రోజుకు పదిసార్లయినా టీ తాగుతాడు బాగా చక్కెర వేయించుకుని.

పనికి బయలుదేరేముందు బండి బాగా తుడుస్తాడు. టైర్లలో గాలుందో లేదో చూసుకుంటాడు. అంతా సవ్యంగా లేక ఏదైనా దారిలో గడబిడయితే బండి ఎక్కినవాళ్లు తిట్టుకుంటారు. అదేమిటో అందరూ "త్వరగా పోనీ, త్వరగా పోనీ" అంటారు. ఆ బయలు దేరేదేదో కాస్త ముందుగా బయలుదేరకూడదూ.

ఒకసారి సైకిలు చైను పక్కకు పడితే రిక్షా వీధి పక్కగా ఆపాడు. రిక్షాలో ఉన్న అమ్మాయి అరచి, గొడవ చేసి కొట్టినంత పనిచేసింది.

"ఎక్కడా రిక్షాలు లేని చోట ఆపావు. నా దురదృష్టం కొద్దీ దొరికావు. ముందే చూసుకోవద్దూ రిక్షా సరిగా వుందో లేదో! నాకు టైమయిపోతోంది. వేళకు చేరకపొయ్యానంటే ఇంటర్వ్యూ లేదూ, ఉద్యోగమూలేదు."

"అమ్మ తల్లీ. నా రిక్షా బాగానే ఉంది. కాస్తచైను పక్కకు పోయిందంతే" అంటే వినదే. అక్కడికీ స్పీడుగా తొక్కి తొక్కి ఆమె చేరవలసిన టైముకంటే కాస్త ముందుగానే చేర్చాడు. అప్పుడు చిరునవ్వులు ఒలకబోసి "థాంక్యూ" అని చిల్లర కూడా తీసుకోకుండా వెళ్ళిపోయింది. పాపం ఆమె తాపత్రయం ఆమెది ఉద్యోగం దొరికిందో లేదో మరి.

ఇంకోసారి ఒక పిల్లా, పిల్లాడూ తన బండెక్కారు. దారంతా ఆ అమ్మడు ఏడుస్తూనే ఉంది. అతను ఓదారుస్తూనే ఉన్నాడు. సాయంకాలం చల్లగాలి హాయిగానూ ఉంది మరి. ఇద్దరూ కబుర్లు చెప్పుకోక గొడవ పడుతున్నారేమిటో.

"క్షమించమని అడిగాను కదా! అయినా కోపం పోలేదా?" అన్నాడు ఆ అబ్బాయి.

"పో, నీతో అసలు మాట్లాడను. నన్ను మా ఇంటి దగ్గర దింపెయ్" అంటోంది ఆమె ఏడుపు గొంతుతో.

"అంత కోపమయితే ఎలా? నేను టైముకు వచ్చేవాడినే. ఇంతలో ఓ ఫ్రెండు తగిలాడు. నాకు పనుంది వెళ్ళాలిరా అన్నా వదలడే ఎక్కడికి పోతున్నావు పద నేనూ వస్తాను అంటాడు. వాడిని వదిలించుకొని వచ్చేసరికి ఆలస్యమయింది."

"నువ్వెప్పుడూ ఏవో సాకులు చెప్తుంటావు నిన్నసలు నమ్మను."

"నిజం ఒట్టు. నాకు తెలీదా నువ్వు ఒంటరిగా పార్కులో నాకోసం ఎదురు చూస్తుంటావని, అలా ఆడపిల్లలు ఒంటరిగా ఉంటే రోమియోలు వెంటబడతారని."

"అన్నీ అబద్ధాలే" మరలా ఏడుపు మొదలు పెట్టింది.

"ప్లీజ్ ఐయామ్‌సారీ. చూసేవాళ్ళేమనుకుంటారు?"

"అంతేగాని నా బాధ నీకర్థం కాదన్నమాట."

"నో..నో. అలా అనకు. నువ్వు నా ప్రాణం."

"ఆ వెధవలు ఎన్నెన్ని మాటలన్నారు! నేనెటు వెళ్తే అటు వచ్చారు. నోటికెంత వస్తే అంత..."

"ఉంటారు. అటువంటి లుచ్చాలుంటారు. ఆడవాళ్ళంటేనే వాళ్ళకదో గేమ్. వెధవలు. వాళ్ళింట్లో ఆడవాళ్ళు వేరు అనుకుంటారు. అది వాళ్ళకల్చరు. దానికి మనమేం చేస్తాం చెప్పు."

"ఒకడయితే చేయి పట్టుకోబోయాడు. రేటెంత అని ఇంకొకడు. చుట్టూ ఉన్న జనం అసలు పట్టించుకోలేదు. అందుకే పరిగెత్తాను. నువ్వు ఎదురుపడకపోతే వెళ్ళిపోయేదాన్ని..."

"ప్లీజ్ ... ఇక ఏడవకు. ఇదిగో రుమాలు. కళ్లు తుడుచుకో. నేనున్నానుగా. ఇక భయం ఎందుకు?"

"నేను త్వరగా వెళ్లాలి."

"వెళ్దువుగానిలే. నేను ఇంటిదాకా వచ్చి దిగబెడ్తాను. అక్కడ ఐస్ క్రీం షాపుకు వెళ్దాం. ఈ మధ్య రిపుల్స్ వచ్చింది తెలుసా? ఈ రోజు అదే తీసుకొందాం."

"నాకేం రిపుల్స్ వద్దు గిపుల్సూ వద్దు. నేను వెళ్లాలి."

"నా మాట విను. ప్లీజ్. ఈ ఒక్కసారికీ బంగారు తల్లివి కదూ."

ఆ అమ్మాయి తల ఊపిందో, చిరునవ్వు నవ్విందో తెలీదుగాని ఆ అబ్బాయి అన్నాడు.

"రిక్షా కొంచెం ముందుకు తీసుకెళ్లి కుడివైపున ఆపు."

ఇప్పుడు తలచుకుంటే రంగన్నకు నవ్వువచ్చింది. పాపం ఆ ప్రేమ పావురాలు ఎలా ఉన్నాయో! వాళ్ల ప్రేమ ఫలిస్తుందో లేదో! రిక్షాలో ఎక్కేవాళ్లు చాలా మంది అనుకుంటారు. తానొక యంత్రమని.

తనకూ అన్నీ అర్థమవుతాయి. కాని మనకేం సంబంధమని ఊరుకొంటాడు. తనకు కొన్ని ముక్కలు ఇంగ్లీషూ తెలుసు. హిందీ తెలుసు. తెలుగు సరేసరి. ఏడో తరగతి దాకా చదువుకొన్నాడు. చాయ్ దుకాణంలో కూర్చుని రోజూ తెలుగు పేపరు చదువుతాడు. ప్రపంచమెలా ఉందో బాగానే తెలుసు.

ఈ కొట్లాటలు, దెబ్బలాటలు, చంపుకోటాలు ఏం రోగం వీళ్లకి అనిపిస్తుంది. ఉన్న జీవితంలో కష్టాలు చాలవనా. రెండుపూట్లా తిండి గడిచే మార్గం చూసుకోక, ఎవని బతుకు వాడు బతుక్కోక, ఎందుకొచ్చిన బాధలివి. మనిషికి మనిషి సాయపడేది పోయి...

రంగన్నకు ఆ షెల్వారు కమీజు అమ్మాయి గుర్తుకొచ్చింది. చేతిలో పుస్తకాలున్నాయి. సుల్తాను పేటకు పోనివ్వమంది. తను ట్రాఫిక్‌లో రిక్షా తొక్కుకుంటూ పోతున్నాడు. కొంచెం

దూరం పోయాక "ఇటు కుడివైపునుంచి వెళ్లమంటారా లేక నేరుగా మార్కెట్టు మీదుగా వెళ్లమంటారా" అని అడిగాడు జవాబురాలేదు.

"ఏవైపో చెప్పండమ్మా. మళ్లా కొంచెం దూరం పోయాక వెనక్కి తిప్పమంటే కష్టం. ఈ మిట్ట ఎక్కిరాలేను." ఆ అమ్మాయి అప్పుడూ మాట్లాడలేదు.

"ఏందమ్మ ఏమీ చెప్పవు" అని తల పక్కకు తిప్పాడు. తెల్లదుపట్టా సైకిలు చక్రంలో నలుగుతోంది. ఠక్కున రిక్షా ఆపాడు. వెనక్కి చూసిన రంగన్నకు చెమట్లు పోసేశాయి. "అమ్మోయ్, అమ్మోయ్" అని అరిచాడు. ఆ పిల్ల తల పక్కకు ఒరిగిపోతోంది. ఆ దుపట్టా మెడచుట్టూ బిగుసుకొంటోంది.

గబుక్కున ఆ దుపట్టా మెడ నుంచి లాగేశాడు. పక్కనున్న దుకాణం నుండి మంచినీళ్లు తెచ్చిచ్చాడు. ఆ అమ్మాయి కాస్త తేరుకొంది. ముఖంలోకి రంగు వచ్చింది. చక్రంలో నుండి దుపట్టా ఊడదీసి ఆమెకిచ్చాడు.

"సోడా తెచ్చిచ్చేదా అమ్మా?"

వద్దని తల ఊపింది.

"తాగండమ్మా" అని దుకాణం నుండి నిమ్మకాయ సోడా తెచ్చిచ్చాడు.

కొద్దిగా తాగి వదిలేసింది.

"కాస్సేపు ఆగమంటారా?"

"ఫర్వాలేదు. పోనీ" అంది నీరసంగా

"ఏందమ్మా. ఆ మాత్రం చూసుకోకూడదూ. ఎంత పనయింది! కాసింతలో ఎంత గండం గడిచింది. నేను చూశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే..."

ఆ అమ్మాయి భుజాల నిండుగా దుపట్టా కప్పుకుంది. కళ్లల్లో నీళ్లు చిమ్మాయి.

"పోనీలేమ్మా. ఇంకెందుకు బాధ" అని పెడలు మీద కాలేశాడు. ఆమె ఇంటి ముందు రిక్షా ఆపినప్పుడు డబ్బులిచ్చి "శుక్రియా" అంది. తను సలామ్ కొట్టాడు.

రంగన్న రిక్షా మొత్తం తుడిచేశాడు. తనకూ ఆటో కొనుక్కోవాలనే ఉంది. కాని డబ్బు? అయినా కొనుక్కోవాలి. ఇప్పటికే కొంత దాచాడు. వాళ్లమ్మవి కొన్ని వెండి నగలున్నాయి. అవి అమ్మినా ఇంకా రెండు వేలో మూడువేలో తక్కువ పడుతుంది. తనకు ఎవరి దగ్గరా చెయ్యి

చాపాలని లేదు. స్థోమత ఉన్నప్పుడే కొంటాడు. కానీ కొని తీరాలి. అప్పుడే బతుకు బాగుపడేది. తన ఇల్లు, తన సంసారం, ఎన్నాళ్లని అక్కా బావల దగ్గర ఉంటాడు. తనకు మాత్రం వయసు పైబడటంలా... ఇరవై ఐదేళ్లు ఏం తక్కువ వయసా?

రంగన్న సీటు పైకెత్తి దులిపి తుడిచి మళ్లా పెట్టబోయాడు. అప్పుడు చూశాడు దాన్ని. నల్లగా ఉంది. బంగారం రంగులో బటను మెరుస్తోంది. ఒక క్షణం మతి బోయినట్టయింది. పైకి తీశాడు. ఆడవాళ్లు చేతిలో పట్టుకొనే చిన్న సైజు పర్సది. తెరచి చూశాడు. రెండు వంద రూపాయలనోట్లు, రెండు పదినోట్లు, చిల్లర ఆ లోపల చిన్న దువ్వెన, పౌడరు డబ్బా, రుమాలు, ఏదో రసీదు. ఇదేమిటి ఈ ఎర్రకాగితం? పొట్లం విప్పాడు. ఉదయపు ఎండలో తళతళా మెరిసింది చైను. బంగారంది. అరచేతిలో వేసుకు చూశాడు. బరువుగానే ఉంది. ఏడువేల రూపాయలకు తక్కువ చేసేలా లేదు. ఎంత లేదన్నా ఆరువేలన్నా వస్తాయి. ఇదే కాబోలు అదృష్టం వెతుక్కొని రావడమంటే.

ఒక క్షణం రంగన్న తనను తానే మరచిపోయాడు. సీటు సర్దేశాడు. అప్పుడే ఆటో కొన్నంత సంతోషమయింది.

"పరాయి సొత్తు కలిసి వస్తుందా" అని అనుమానం వచ్చింది. తప్పేముంది? నేను దొంగలించలేదే! దానంతటదే దొరికింది. నిన్న నా బండ్లో ఎవరెవరు కూర్చున్నారో నాకేం గుర్తు? ఉన్నా ఎవరి పర్సని తెలుస్తుంది? వాళ్లేం తనకు పేరు చెప్పి కూర్చుంటారా బండిలో? ... ఒక వేళ పోలీసు స్టేషనుకువెళ్తే .. ఎందుకొచ్చిన తంటా. మెడకు ఉచ్చు బిగించుకున్నట్లే.. టవలుతో మొహం తుడుచుకున్నాడు.

నెమ్మదిగా రిక్షా ముందుకు కదిలింది. "పాపం ఎవరి నగో? ఎన్ని కష్టాల కోర్చి చేయించుకున్నారో! లేక అపురూపమైన ప్రేమ కానుకగా ఎవరైనా చేయించి పెట్టారేమో! ఏ ఆడ కూతురి పెళ్ళి కోసం తయారీ జరుగుతోందో! పోగొట్టుకున్న వాళ్లు ఎంత దుఃఖపడుతున్నారో, అటువంటి సొమ్ము తనకు అచ్చి వస్తుందా?"

రోడ్డు పక్కన రిక్షా ఆపి చాయ్ దుకాణంలోకి వెళ్లాడు. గ్లాసులో వేడివేడి టీ చప్పరిస్తూ ఆలోచిస్తున్నాడు. ఎవరిదయి ఉంటుంది ఆ పర్సు? తన పిచ్చిగాని తనకేం అంజనం వేయటం వస్తుందా ఎవరి పర్సో తెలిసిపోటానికి. టీగ్లాసు వాపసు ఇచ్చేసి డబ్బులు చెల్లించి

ఇవతలకి వచ్చాడు. బండి చెట్టు కింద ఆపి సవారీల కోసం ఎదురు చూడసాగాడు. ఎవరిదయి ఉంటుంది పర్సు?

ఈ ఆలోచన రంగన్నను తినేస్తోంది. మరలా ఆ పర్సు తెరిచి చూశాడు. ఇందాక చూసినవన్నీ ఉన్నాయి. దువ్వెన, పౌడరు డబ్బా, రుమాలు, రసీదు... రసీదు విప్పి చూశాడు. డ్రైక్లీనరు రసీదుపైన కలగాపులగంగా అడ్రసు వ్రాసుంది. అది తను చదవలేడు. ఇటూ అటూ చూశాడు. ఎదురుగా వస్తున్న కళ్లజోడాయనకు చూపించాడు. ఆయన అడ్రస్ సరిగా చదివి చెప్పాడు. ఆయనకొక సలామ్ కొట్టి రంగన్న తన రిక్షా చేరుకున్నాడు. బండి స్పీడందుకొంది. రంగన్న మనసు తేలిగ్గా దూది పింజలా ఉంది. దారిలో "ఏయ్ రిక్షా, రిక్షా" అని చప్పట్లు తట్టి పిలుస్తున్న పిలుపులు వినిపించుకోటం లేదు. రంగన్న ఏదో కూనిరాగం తీస్తున్నాడు. కాళ్లు మాత్రం అవిరామంగా పెడలు తొక్కుతున్నాయి.

*(2 సెప్టెంబరు 1990)*